క్లుప్తంగా

20న ఏకలవ్య విగ్రహావిష్కరణ



ఆర్డీఓ వసంతబాబుకు ఆహ్వాన పత్రికను అందిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కళ్యాణదుర్గం: కంబదూరు మండల కేంద్రంలో ఈనెల 20న ఏకలవ్య విగ్రహావిష్కరణకు తరలి రావాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ప్రజా సంఘాల నాయకులు ఎరుకుల సుబ్బరాయుడు, తిప్పేస్వామి నాయక్, ఆర్కే రాజు, సాకే గురుమూర్తి, చెలిమప్ప, తిమ్మరాజు, ఓబిలేశు, మారెన్నలు ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. ఆర్డీఓ వసంతబాబు, తహసీల్దార్ భాస్కర్, ఉద్యోగులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు.

ఉద్యాన రాయితీలు సద్వినియోగం చేసుకోండి

కళ్యాణదుర్గం రూరల్: ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు ఇచ్చే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి కృష్ణ తేజ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరం రైతులకు ఉద్యాన పంటల పెంపకం కింద అరటి, బొప్పాయి, చీనీ, దానిమ్మ, నేరేడు, డ్రాగన్ ఫ్రూట్, విడిపూల సాగు కింద హైబ్రిడ్ బంతిపూలు, సాగు చేస్తున్న రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులు 40 శాతం రాయితీ అందిస్తామన్నారు. 27లోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని తాగునీటి సరఫరాలో నెలకొన్న జాప్యాన్ని త్వరిగ తగతిన పరిష్కరించేందుకు క్షేత్రస్థాయి చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఈ మేరకు గురువారం ఆమె తన చాంబర్‌లో మున్సిపల్ డీఈ రవిప్రకాష్ నాయుడు, ఏఈలు ప్రతాప్, నరసింహులుతో తాగునీటి సమస్య, వీధి దీపాల సమస్యపై చర్చించారు. ఈదురు గాలులు, వర్షాలతో విద్యుత్ తీగల పడడుతుండడం, వీరాపురం వద్ద పంపింగ్‌కు ప్రత్యేక ఫీడర్ సౌకర్యం లేకపోవడం సమస్యలను అధికారులు చైర్‌పర్సన్ దృష్టికి తెచ్చారు. ప్రత్యేక ఫీడర్ ద్వారా కనెక్షన్ ఏర్పాటు చేసి నీటి సమస్య లేకుండా చూడాలనే ఈ సందర్భంగా చైర్‌పర్సన్ విద్యుత్‌శాఖ ఎస్ఈతో, ఏడీలతో సంప్రదించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ పొరాళ్ల శివకుమార్, గౌని శ్రీరామిరెడ్డి, బషీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించండి

కళ్యాణదుర్గం: పట్టణంలో ఎస్టీ కమ్యూనిటీ భవనానికి స్థలం కేటాయించాలని కళ్యాణదుర్గం డివిజన్ ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మోహన్, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుళ్లాయప్ప కోరారు. గురువారం అనంతపురంలోని రెవెన్యూ భవన్‌లో జరిగిన ఎస్సీ,ఎస్టీ ప్రత్యేక గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కళ్యాణదుర్గంలో ఆగిపోయిన అంబేడ్కర్ భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్టీ కమ్యూనిటీ భవనానికి 50 సెంట్ల స్థలాన్ని మంజూరు చేయాలని కోరారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



డిపో గ్యారేజీ గేటు ముందు ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

రాయదుర్గంటౌన్: ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం ప్లకార్డులతో నిరసన తెలిపారు. గురువారం స్థానిక డిపో గ్యారేజీ గేటు ముందు ఏపీపీటీడీ(నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్) ఆధ్వర్యంలో గేట్ ధర్నా నిర్వహించారు. ఏపీపీటీడీ డిపో అధ్యక్ష, కార్యదర్శులు జిలాన్, తిప్పేస్వామి, రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీ నాగరాజు మాట్లాడుతూ ఇప్పటికే రెండు విడతలుగా డిమాండ్లు పరిష్కరించాలని నిరసనలు తెలియజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో దామోదర్, సుబ్బరాయుడు, దూర్‌పీరా, సతీష్‌కుమార్, నాగరాజు, యోగి తదితరులు పాల్గొన్నారు.

కమనీయం..కల్యాణోత్సవం



ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: మండల కేంద్రంలోజనార్దన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం స్వామివారి రథోత్సవం జరుగుతుందని ఈఓ అంగడాల కృష్ణయ్య తెలిపారు.

జనార్దన వేంకటేశ్వరస్వామికి పట్టువస్త్రాలు

మేజర్ పంచాయతీ తరఫున సర్పంచు మోనాలిసా, పాలకవర్గ సభ్యులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యదర్శి మల్లయ్య, ఆలయ ఈఓ అంగడాల కృష్ణయ్య, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



రాయదుర్గంలోని 17వ వార్డు మధుటాకీస్ వెనుక భాగంలో చెరువును తలపిస్తున్న దృశ్యం



జ్వరాలు, డయేరియా బాధితులతో కిక్కిరిసిన ప్రభుత్వాస్పత్రిలోని ఇన్‌షేషెంట్స్ వార్డు

పడకేసిన పారిశుధ్యం

- మురుగునీరు ముందుకు కదలక అవస్థలు
- పట్టణంలో అస్తవ్యస్తంగా డ్రెయినేజీలు
- ప్రబలుతున్న విషజ్వరాలు, డయేరియా



కేబీ ప్యాలెస్ రోడ్డులోని కాలువలో ముందుసాగని మురుగు

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పురపాలక సంఘం పరిధిలో పారిశుధ్యం పడకేసింది. ఎక్కడ చూసినా అపరిశుభ్రత నెలకొంది. డ్రైనేజీల్లో మురుగునీరు ముందుకు కదలడంలేదు. దీనికితోడు దోమల బెడద అధికంగా ఉంది. దీంతో ప్రజలు విషజ్వరాలు, డయేరియా బారిన పడి ఆస్పత్రి పాలవుతున్నారు. రాయదుర్గం పట్టణంలోని 32,32,31 వార్డుల్లోని వీధుల్లో అనేక చోట్ల డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక



పట్టణంలోని వీధుల్లో గుంపులుగా స్వైరవిహారం చేస్తున్న పందులు సంచారం

మురుగునీరు రోడ్లపై పారుతూ దుర్వాసన వెదజల్లుతోంది. అనేక ఏరియాల్లోని ప్రధాన డ్రైనేజీల్లో మురుగునీరు ముందుకు సాగడం లేదు. ఇంకా కొన్ని చోట్ల ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిల్వ ఉండి చెరువులను తలపిస్తున్నాయి. ఫాగింగ్ మిషన్లు మరమ్మతుకు గురై మూలకు చేరడంతో దోమల వ్యాప్తి మరింత అధికంగా ఉంది. దీంతో పట్టణంలో ఇటీవల దోమల బెడద తీవ్రస్థాయికి చేరుకుంది. మండుతున్న ఎండలకు తోడు అస్తవ్యస్త డ్రైనేజీ వ్యవస్థతో ప్రజలు సీజనల్ వ్యాధులకు లోనవుతున్నారు. ఇప్పటికే రోజుకు పదుల సంఖ్యలో జ్వరాలు, డయేరియాతో ఆస్పత్రిపాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని డ్రైనేజీల్లో పూడిక తీసి మురుగునీరు ముందుకు సాగేలా చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



5వ వార్డు చేపలవీధిలో కాలువ దుస్థితి ఇలా..



31వ వార్డు బైలాంజనేయస్వామి గుడి కిందవైపు ఏరియాలో రోడ్లపై పారుతున్న మురుగునీరు

దుర్వాసన భరించలేకపోతున్నాం



డ్రైనేజీలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మురుగునీరంతా పై కాలనీ నుంచి వచ్చి రోడ్లపై నిల్వ ఉంటుంది. రాత్రిబవుళ్లు దుర్వాసన వస్తోంది. ఎప్పుడో ఒకసారి మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది వచ్చి శుభ్రం చేస్తారు. అధికారులు స్పందించి డ్రైనేజీలు ఏర్పాటు చేయాలి. మురుగునీరు నిల్వ ఉండడంతో కాలనీవాసులు రోగాల బారిన పడుతున్నారు.

– చెన్నవీరమ్మ, 31వ వార్డు, బైలాంజనేయస్వామి గుడి ఏరియా, రాయదుర్గం

డిస్పోజల్ డ్రైనేజీలు నిర్మించాలి



కాలనీల్లో అవసరమైన చోట్ల డిస్పోజల్ డ్రైనేజీలు నిర్మించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. అనేక కాలనీల్లో డ్రైనేజీలు లేక రోడ్లపై నీరు నిల్వ ఉండి దుర్వాసన వస్తోంది. దోమల వ్యాప్తి అధికంగా ఉంది. శివారు ప్రాంతాల్లో పారిశుధ్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మల్లాపురం లేఅవుట్, ఎంసీఏ లేఅవుట్, గౌడ లేవుట్లలో మురుగునీటి వ్యవస్థ లేదు. దీంతో రోడ్లపై నీరు నిల్వ ఉండి, దోమలు విజృంభిస్తున్నాయి. శివారు కాలనీల్లో డ్రైనేజీలు నిర్మించాలి.

– పి. తిప్పేస్వామి, వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం పట్టణాధ్యక్షుడు, రాయదుర్గం

టెండర్లు పిలిచాం



పారిశుధ్యం మెరుగునకు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాం. ఇటీవల సర్వే చేసి 120 కిలోమీటర్ల పరిధిలో డ్రైనేజీల్లో పూడిక తీతకు రూ.22 లక్షలతో ఇటీవల టెండర్లు పిలిచాం. రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.20 కోట్ల ప్రత్యేక నిధులకు ప్రతిపాదనలు పంపాం. మంజూరయితే అవసరమైన చోట్ల డ్రైనేజీల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పూడికతీతకు ప్రాధాన్యత ఇస్తున్నాం. డ్రైనేజీలు నిర్మిస్తే డిస్పోజల్ సమస్య తీరుతుంది. ఫాగింగ్ మిషన్లను వినియోగంలోకి తెస్తాం.

– దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం

ఫీజు రీయింబర్స్ అందక చదువుకు దూరం

ఉరవకొండ: ఇంజనీరింగ్, డిగ్రీ, ఫార్మసీ, ఎంబీఏ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలు కూటమి సర్కారు ఇవ్వకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరం కావాల్సిన పరిస్థితి నెలకొందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రూ.3,900 కోట్లు బకాయి ఉంటే కూటమి ప్రభుత్వం రూ.1300 కోట్లు మాత్రమే విడుదల చేసిందన్నారు. అది కూడా మాజీ సీఎం వైఎస్ జగన్ యువత పోరు కార్యక్రమానికి పిలుపునివ్వడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమించిన తర్వాత నిధులు విడుదల చేశారన్నారు. తాజాగా ఈవిద్యా సంవత్సరంలో రూ.3,900 కోట్లు చెల్లించాల్సి ఉండగా, బడ్జెట్‌లో మాత్రం కేవలం 2,500 కోట్లు మాత్రమే కేటాయింపులు చేశారన్నారు. పరీక్షా ఫీజు కోసం కోర్సు ఫీజు కోసం మొత్తం చెల్లించాలని యాజమాన్యాలు విద్యార్థులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నా విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ నిద్రపోతున్నారా అని ప్రశ్నించారు.

రైతుల మధ్య తోపులాట



గ్రామీణ బ్యాంక్‌లో కిక్కిరిసిన రైతులు

కూడేరు: పంట రుణాల రెన్యూవల్ కోసం రైతుల మధ్య తోపులాట జరిగింది. గురువారం కూడేరులోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో షెడ్యూల్ ప్రకారం కమ్మూరు రైతుల రుణాలను రెన్యూవల్ చేశారు. అయితే బ్యాంకు ప్రధాన కార్యాలయం కాల్ సెంటర్ నుంచి రుణాలు త్వరగా రెన్యూవల్ చేసుకోవాలని రైతులందరికీ ఫోన్ చేసి తెలియజేయడంతో ఇతర గ్రామాల రైతుల కూడా తరలివచ్చారు. దీంతో రద్దీ పెరిగి, రైతుల మధ్య తోపులాట జరిగింది. బ్యాంకు మేనేజర్ రవికుమార్ అందరికీ రెన్యూవల్ చేస్తామని తోచుకోవద్దని చెప్పినప్పటికీ రైతులు వినలేదు. షెడ్యూల్ మేరకు కేటాయించిన గ్రామాల రైతులు మాత్రమే రావాలని మేనేజర్ తెలియజేశారు.

అంబేడ్కర్ చిత్రపటం బహూకరణ



అంబేడ్కర్ చిత్రపటాన్ని జూనియర్ సివిల్ జడ్జి సుభాన్ చేతుల మీదుగా ఆవిష్కరిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం: స్థానిక కళ్యాణదుర్గం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసేందుకు బహుజనుల లాయర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు న్యాయవాది నారాయణప్ప బహూకరించారు. జూనియర్ సివిల్ జడ్జి సుభాన్ చేతుల మీదుగా అంబేడ్కర్ చిత్రపటాన్ని ఆవిష్కరించారు. జడ్జి మాట్లాడుతూ ప్రతి కోర్టులో అంబేడ్కర్, మహాత్మగాంధీ చిత్రపటాలను ఏర్పాటు చేయాలన్నారు. సీనియర్ న్యాయవాదులు దేవేంద్ర, కరణం తిప్పేస్వామి, ఎండీ సంజీవయ్య, సంపత్‌కుమార్, దాదాఖలందర్, మల్లికార్జున, పట్టాభి, రామాంజినేయులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోండి



తాగునీటి సమస్యపై ఆర్‌డబ్ల్యుఎస్ జేఈని ప్రశ్నిస్తున్న సర్పంచు హనుమంతప్ప

కణేకల్లు: అసలే వేసవి కాలం.. కనీసం గుక్కెడు తాగునీరు ఇవ్వలేని పరిస్థితుల్లో ఉన్నాం.. నీరు ఇవ్వకపోతే గ్రామాల్లో మహిళలు దాడులు చేసేలా ఉన్నారని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ వంద్రయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వైస్ ఎంపీపీ లీలావతి, ఎంపీడీఓ పీడీ శ్రీనివాసులు, డీటీ విశ్వనాథ్ పాల్గొన్నారు. బిదరకుంతం సర్పంచు హనుమంతప్పతోపాటు పలువురు సభ్యులు మాట్లాడారు. గ్రామాల్లో నీటి కోసం ప్రజలు శ్రీరామరెడ్డి తాగునీటి పథకంపై ఆధారపడ్డారని, వర్కర్ల సమ్మెతో నీటి సరఫరా ఆగిపోయిందని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ఎంపీడీఓ తెలిపారు. దెబ్బతిన్న పప్పుశనగ, మిర్చి, మొక్కజొన్న, వరి, పత్తి పంటలకు పరిహారమిచ్చి రైతులను ఆదుకోవాలని సభ్యులు కోరారు. ఏఓ ఎ.శ్రవణ్‌కుమార్, ఏపీఓ సుధాకర్, ఏపీఎం ఆంజనేయులు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శివకృష్ణారెడ్డి, విద్యుత్‌శాఖ ఏఈఈ శంకర్‌నాయక్, వెటర్నరీ డాక్టర్ వెంకటరెడ్డి, ఎంఈఓలు లక్ష్మణ్ణ, భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు. కోకుర్తిలో సర్పంచు భాస్కర్‌రెడ్డి,ఎస్.హనుమాపురం సర్పంచు జయరాంచౌదరి సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు.

సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ పద్మ

బొమ్మనహాళ్: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే మండలాభివృద్ధి సాధ్యమని ఎంపీపీ పద్మ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ పద్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయా శాఖల అధికారులు తమ పరిధిలో జరిగిన అభివృద్ధి కార్యాకలాపాలను సభ్యులకు వివరించారు. ఎంపీపీ మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశాలకు అధికారులంతా హాజరు కావాలన్నారు. వేసవిలో నీటి సమస్య లేకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునివేలు, ఎంపీడీవో విజయభాస్కర్, ఈఓపీఆర్‌డీ దాస్, ఎంఈఓలు వీరన్న, మల్లికార్జున, పశువైద్యాధికారి వెంకటరెడ్డి, పంచాయతీ జేఈఈ జగదీష్, ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీప్రసన్న, వైస్ ఎంపీపీలు కందేపల్లి రమేష్, నాగరత్నమ్మ, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు ఐడీని ఆధార్‌తో అనుసంధానం చేయాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు ఎర్రిస్వామి

ఉరవకొండ: ఓటరు ఐడీ కార్డును ఆధార్‌తో అనుసంధానం చేయాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితా పై వివిధ రాజకీయ పార్టీలతో నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ఉరవకొండ తహసీల్దార్ మహబూబ్‌బాషా అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఏసీ ఎర్రిస్వామి మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఈవీఎంల ద్వారా నిర్వహిస్తున్న ఎన్నికలపై అన్నీ అనుమానాలే అన్నారు. రాబోవు ఎన్నికలనైనా పోస్టల్ బ్యాలెట్‌లో నిర్వహించాలన్నారు. ఈవీఎంలతో నిర్వహించే వాటిలో పోలింగ్ శాతాల్లోనూ తేడాలు కన్పిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ఓటరు జాబితాలో డెత్ కేసులకు సంబంధించి డెత్ సర్టిఫికెట్ లేకపోయినా సంబంధిత పంచాయతీ కార్యదర్శి నుంచి రికార్డుల నుంచి స్వీకరించి వాటిని తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నగర వనం పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ విగ్నేష్ అప్పావు

కళ్యాణదుర్గం: పట్టణంలో ఏర్పాటు చేయనున్న ఫారెస్ట్ నగర వనం పనులను డీఎఫ్‌ఓ విగ్నేష్ అప్పావు ఐఎఫ్ఎస్ గురువారం పరిశీలించారు. పనుల వివరాలను ఇన్‌చార్జ్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మధుబాబును అడిగి తెలుసుకున్నారు. వన నర్సరీలను తనిఖీ చేశారు. సెక్షన్ ఆఫీసర్ షానవాజ్, బీట్ ఆఫీసర్లు, ప్రొటెక్షన్ వాచర్లు ఉన్నారు.

సచివాలయాల్లో పని చేయని ప్రింటర్లు

కూడేరు: కూడేరు, మరుట్ల సచివాలయాల్లో ప్రింటర్లు పనిచేయక రైతులు, అధికారులు అవస్థలు పడుతున్నారు. జల్లిపల్లి, చోళసముద్రం, కూడేరులోని ఏపీజీబీ, స్టేట్ బ్యాంకుల్లో పంట రుణాల రెన్యూవల్స్ చేస్తున్నారు. రైతులు కంప్యూటర్ అడంగల్, వన్‌బీ ధ్రువీకరణ పత్రాలు జతచేయాల్సి ఉంటుంది. మరుట్ల, కూడేరులోని సచివాలయం–1.2లో దాదాపు నెలన్నరగా ప్రింటర్లు పని చేయలేదు. వన్‌బీ , అడంగల్ కోసం ఆయా సచివాలయాల పరిధిలోని రైతులు సచివాలయాలకు వెళ్తే ప్రింటర్ పని చేయలేదని సిబ్బంది చెప్తున్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

రాయదుర్గంటౌన్: అగ్నిప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఫైర్ ఆఫీసర్ నాగేశ్వరరావు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నాల్గో రోజు గురువారం పట్టణంలోని సెయింట్‌థామస్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తూ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈసందర్భంగా ఫైర్ సిబ్బంది ప్రదర్శించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

రోడ్డు నిబంధనలు పాటించాలి

బ్రహ్మసముద్రం: వాహనదారులు ప్రమాదాలు జరగకుండా రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలని ఎస్‌ఐ నరేంద్రకుమార్ సూచించారు. గురువారం మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామం సమీపంలో వాహనదారులు, ప్రజలకు రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాలు అరికట్టడంపై అవగాహన కల్పించారు.

అకాల వర్షంతో మామిడి రైతులకు నష్టం

శెట్టూరు: మండలంలో బుధవారం కురిసిన అకాల వర్షంతో మామిడి రైతులు నష్టపోయారు. గాలివానకు అనుంపల్లి, బసంపల్లి, కనుకూరు గ్రామాల్లోని మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. అనుంపల్లిలో నరసింహప్ప, బసంపల్లిలో నాగేంద్రకు చెందిన మామిడి చెట్ల నుంచి మామిడి కాయలు రాలిపోయాయి.

ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు

ఉరవకొండ: స్థానిక దేవాంగ సంక్షేమ సంఘం ఫంక్షన్ హాలులో కర్నూలుకు చెందిన సుశీల నేత్రాలయ ఆసుపత్రి సౌజన్యంతో దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 110 మంది కంటి పరీక్షలు చేయగా, 45 మంది కంటి శస్త్ర చికిత్సలకు ఎంపికయ్యారు. దేవాంగ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు కొమ్మసాని బాలచంద్ర మాట్లాడారు. శిబిరంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లేష్, ఉపాధ్యక్షుడు రెడ్డి నాగరాజు, ప్రధాన కార్యదర్శి ప్రతాప్, కార్యదర్శి నిమ్మల ప్రసాద్, ఎంసీ నాగభూషణం, విశ్వనాథ్, చిట్టారఘు, ఆర్‌సీ ప్రసాద్, అశోక్, రాము, శివకుమార్, చెంగలమోహన్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

గణపతి, దత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ట



దత్తాత్రేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం

కూడేరు: స్థానిక షిర్డీసాయిబాబా ఆలయంలో గణపతి, దత్తాత్రేయ విగ్రహ ప్రతిష్టాపన గురువారం జరిగింది. ఉదయం 8 గంటలకు వేదపండితులు గణపతి, దత్తాత్రేయ స్వామి విగ్రహాలకు యంత్ర , బింబి ప్రతిష్టాపన పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

రుణాలకు దరఖాస్తు చేసుకోండి

రాయదుర్గంటౌన్: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2024–25 సంవత్సరానికి సంబంధించి స్వయం ఉపాధి సబ్సిడీ రుణాలకు నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణానికి మూడు చక్రాల ప్యాసింజర్ ఈ ఆటో (రవాణా సెక్టర్) కింద రెండు యూనిట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ఒక్కో యూనిట్ విలువ రూ.3 లక్షలకు గాను రూ.లక్ష సబ్సిడీ వస్తుందన్నారు. దరఖాస్తుదారులు మే 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

20 నుంచి ఆంగ్ల శిక్షణ

కుందుర్పి: కళ్యాణదుర్గం ఈనెల 20 నుంచి నెల రోజుల పాటు ఉచిత ఆంగ్ల శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి తిప్పేస్వామి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కళ్యాణదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలరోజుల పాటు శిక్షణ ఉంటుందని 9వ తరగతి ఆపై తరగతులు చదివే వారు సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణ ఉంటుందన్నారు.

మాజీ సర్పంచు టి.మస్తాన్‌బీ మృతి

వజ్రకరూరు: మేజర్ పంచాయతీ మాజీ సర్పంచు టి.మస్తాన్‌బీ (101) గురువారం మధ్యాహ్నం మృతిచెందారు. టి.మస్తాన్‌బీ 2006 నుంచి 2012 వరకు వజ్రకరూరు మేజర్ పంచాయతీ సర్పంచుగా పనిచేశారు. టి.మస్తాన్‌బీ మృతదేహం వద్ద వివిధ పార్టీల నాయకులు నివాళులర్పించారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు మస్తాన్‌బీ కుమారుడు దస్తగిరి తెలిపారు.

ప్రతిభావంతులకు సత్కారం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో అత్యధిక ఉత్తమ మార్కులు సాధించిన ప్రతిభావంతులకు గురువారం సత్కరించారు. ప్రిన్సిపాల్ విజయ్‌భాస్కర్, అధ్యాపకులు వివిధ గ్రూపుల్లో టాపర్లుగా నిలిచిన 10 మంది విద్యార్థులను సత్కరించారు. బైపీసీలో 970 మార్కులు సాధించిన ఎ.తస్లీమ్‌ను ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అభినందించారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం



పోషణ పక్వాడా పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు

బొమ్మనహాళ్: పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత నివారించొచ్చని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీప్రసన్న అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పోషణ పక్వాడా పక్షోత్సవాల్లో భాగంగా మండల స్థాయి అధికారులు పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మ, ఎంపీడీఓ విజయభాస్కర్, తహసీల్దార్ మునివేలు, ఈఓపీఆర్‌డీ దాస్, ఎంఈఓలు వీరన్న, మల్లికార్జున, ఏపీఎం రామకృష్ణ, సూపర్‌వైజర్లు గీతా, శాంతకుమారి పాల్గొన్నారు.

రాయదుర్గంటౌన్: పౌష్టికాహారంతోనే బాలింతలు, గర్భిణులు, చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజినమ్మ పేర్కొన్నారు. గురువారం 19వ వార్డు అంబేడ్కర్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యత, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ విజేత పాల్గొన్నారు.